# పంచ నక్షత్ర చికిత్సాలయం

"చంద్రా! మనిద్దరికీ తండ్రి ఒకడే కదా! మనకున్న ఆర్థిక స్తోమతనంతా ఉపయోగించి, వారిని ఈ ఊళ్లో "మంచాదిమంచి" హాస్పటల్‌లో చేర్పించాలి. గొప్ప డాక్టర్లతోటి వైద్యం చేయించాలి. వీలైనంత త్వరలో ఆయన పూర్తిగా కోలుకొనేటట్టు చేయాలి."

సోమశేఖరుడి ఈ అభిప్రాయంతో, తమ్ముడు చంద్రశేఖరుడు, పూర్తిగా ఏకీభవించాడు.

"అవునన్నయ్యా! నాన్నగారికింతవరకూ ఎట్లాంటి జబ్బూ రాలేదు. ఆయన కోసం మనమెన్నడూ డబ్బులు ఖర్చు పెట్టలేదు. అందుకే, అప్పు చేసయినాసరే, ఆయనకి మంచి వైద్యం చేయించాలి."

శివశంకరుడు ఒక ప్రైవేటు కంపెనీలో అకౌంటెంట్‌గా పనిచేసి, రిటైరయ్యి ఇప్పటికి ఐదారుసంవత్సరాలు అయి ఉంటుంది. కష్టపడి పిల్లలిద్దరికీ డిగ్రీవరకూ చదువు చెప్పించాడు. భార్యా దాక్షాయణి పుట్టింటి నుంచి అడపా దడపా అందే కాస్త ఆర్థిక సహాయంతో ఒక చిన్న ఇల్లు కట్టుకుని, పిల్లల్ని పస్తులు పెట్టకుండా, రోజులు గడపగలిగాడు. సోమ చంద్రశేఖరులకు అంత పెద్ద చదువులేమీ చెప్పించలేదు. ఆ పిల్లలకి కూడా చదువంటే, పెద్ద ఆసక్తి ఉండేదికాదు. ఒకేక్లాసులో రెండు సంవత్సరాలు గడపకుండా, వాళ్ళిద్దరూ గట్టెక్కింది లేదు. పెద్ద కుమారుడి డిగ్రీ పూర్తి అయిన వెంటనే ఒక కంపెనీలో ఉద్యోగంలో చేర్చాడు శివశంకరుడు. ఉద్యోగ విరమణగకి ముందు, రెండో కొడుకుని కూడా మరో కంపెనీలో ఉద్యోగస్తుణ్ణిచేసాడు. ఆ విధంగా, ఆర్థికంగా ఒక మంచి స్థాయికి చేరగలిగిన ఆ కుటుంబంలోకి ఒకరి తర్వాత ఒకరిగా ఇద్దరు సుందరీమణులకు స్వాగతం పలకాలని దాక్షాయణి శివశంకరరావు దంపతులకు గ్రీష్మకాలపు దాహం లాంటి మోహం ఉండేది కానీ, తమ భవనాన్ని కాస్తపెద్దదిగా చేసి, ఆధునికి సౌకర్యాలతో దానిని అలంకరించిన తర్వాతే నవ వధువులను మధువిధు కోసం అక్కడికి ఆహ్వానించాలనేది సోమ-చంద్రశేఖరుల పట్టుదల.

గత పదిహేను సంవత్సరాలుగా రక్తపోటు అనే జబ్బును మందు మంత్రం ద్వారా అదుపులో పెడుతూ వచ్చిన శివశంకరుడికి హఠాత్తుగా గుండెపోటు వచ్చింది. ఆ రోజు సెలవు కావడం వల్ల, కొడుకులిద్దరూ ఇంట్లోనే ఉన్నారు. చంద్రుడు పరుగెత్తుకు వెళ్ళి

డాక్టరుని పిలుచుకొచ్చాడు. రోగిని పరీక్షించి, ఇంజక్షన్ చేసి, గది బయటకి వచ్చిన డాక్టరు, ఆందోళనగా ఉన్న ఆ కొడుకుల్ని చూసి.

"ఇందులో భయపడటానికేమీ లేదు! మైల్డ్‌హార్ట్ ఎటాక్, త్వరగా ఒక హార్ట్‌స్పెషలిస్ట్‌కి చూపించాలి." అని వివేకవంతమైన ఉపదేశమిచ్చి, తన లఘుపేటికని చేతిలోకి తీసుకొని వెళ్ళిపోయాడు.

ఆ సమయంలో, ఆ అన్నదమ్ముల మధ్యజరిగినదే ఆ డైలాగు పూర్వప్రస్తావితం.

ఊరిలో ఒక అతి పెద్ద ఆసుపత్రి నుంచి అంబులెన్సు, నిధి ఉన్న చోటుకు భూతం దూసుకువచ్చినట్టు పెద్దశబ్దం చేసుకుంటూ ఆ ఇంటిముందుకు వచ్చి ఆగింది. రోగిని, అతని భార్యాపుత్రులని తనకడుపులోపెట్టుకుని, ఆ భూతం అతి సంతోషంతో తనమార్గానికి పయనించింది.

ఆసుపత్రి వాతావరణంశేఖర సోదరులకి చాలా నచ్చింది. నాలుగు రోజులపాటు శివశంకరుడు ఐ.సి.సి.యు అనే విభాగంలో ఉండాల్సి వచ్చింది. ఐ.సి.సి.యులో రోగిదగ్గర ఒక్కరు మాత్రమే ఉండటానికి అనుమతి ఉండేది. ఆ బాధ్యతని వాళ్ళు ముగ్గురూ ఎంతో సంతోషంగా పంచుకున్నారు. అక్కడి సిబ్బంది అంతా ఎంతో శ్రద్ధగా రోగులకి పరిచర్య చేయడం చూసి, సహోదరులిద్దరికీ ఎంతో ఆశ్చర్యం కలిగింది. ప్రభుత్వాసుపత్రి అయ్యి ఉంటే, అక్కడ ఎంతమంది చేత చివాట్లు తినాలి? ఎంతమంది అజమాయిషీ భరించాలి? ఎన్నెన్ని అసహ్యకరమైన దృశ్యాలు చూడాలి? అని ఆలోచించినప్పుడు, ఈ అసుపత్రి ఒక స్వర్గంలా ఉందని వారికి తోచింది. కానీ, ఆస్వర్గలోకంలో ఎక్కువకాలం ఉండిపోతే, అక్కడ విహరించే అప్సరసల్లో కనీసం ఒక్కరినయినా ప్రేమించకుండా ఉండలేకపోతామని, వాళ్ళ చిరునవ్వులతో ఆకర్షితులైన ఆ సోదరులకి అనిపించింది.

ఈ విషయమై వారెన్నడూ చర్చించుకోలేదు. అక్కడ ఉందవలసి వచ్చిన కొన్ని రోజులపాటు, బ్రదర్స్ అండ్ సిస్టర్స్ అనే సంబంధాలు పెట్టుకోవడమే ఆరోగ్యానికి మంచిదని, ఒకవేళ, ఆ ఆసుపత్రిలో అంతేవాసిగా కొంతకాలం ఉండాల్సి వస్తే, అప్పుడు ఆరోగ్యపరిచారికలైన ఆశ్వేత వస్త్రధారిణులతో ప్రణయకలాపాలు సాగించడం గురించి ఆలోచించవచ్చని వాళ్ళు తమ మనసులని సమాధానపరుచుకున్నారు.

ఇరవైనాలుగ్గంటలూ ఆ ఆసుపత్రిలో నేలని ఊడుస్తూ, తడిబట్టతో తుడుస్తూ,

బాత్రూమును శుభ్రం చేస్తూ ఉండే ఆ పనివాళ్ళ "పరోపకారార్థం ఇదం శరీరం" అనే సేవాతత్పరతని చూసి, శేఖరులిద్దరూ సాయుజ్యం పొందుతున్నప్పుడు ఒక సందర్శకుడు వారితో.

"ఇదంతా చూసి ఆశ్చర్యపడటం కానీ, ఆనందించడం కానీ, అనవసరం బ్రదర్స్! వీటికయ్యే ఖర్చులన్నీ వేరెవరూ భరించరు. రోగులు సన్నబడటానికీ, వారు చెల్లించే బిల్లులు లావెక్కడానికీ కల కారణాల్లో ఇవి కూడా ఉంటాయి." అని విడమరచి చెప్పాడు.

"వీళ్ళు ప్రదర్శిస్తున్న వినయ ప్రహసనాలకేమీ పడిపోకూడదు. చిరునవ్వు నవ్వుతూ తడిగుడ్డతో గొంతులు కోసే రకాలు వీళ్ళు" మరొకడి వ్యాఖ్య.

"ఈ మధ్యనే వయసు మళ్ళిన ఒక స్త్రీని హార్ట్ ఎటాక్ అని చెప్పి ఆమె పిల్లలు అడ్మిట్‌చేయించారు. అది ఒక శనివారం సాయంత్రం. ఆ రాత్రే కొన్ని టెస్టులు చెయ్యడం, ఇంజక్షన్‌లు ఇవ్వడం అన్నీ జరిగాయి. మర్నాడు ఆదివారం అవడం వల్ల, కావలసిన డాక్టర్లు కొంతమంది ఆసుపత్రికే రాలేదు. పాపం! ఆ స్త్రీ రెండు, మూడుసార్లు గుండెనొప్పితో విలవిల్లాడుతూ ఏడ్చినప్పుడు, ఏదో సెడెటివ్ ఇచ్చి తాత్కాలిక ఉపశమనం మాత్రమే కలిగించారు. ఆ రాత్రే ఆమె చనిపోయింది. మర్నాటి ఉదయం శవాన్ని తీసుకెళ్ళబోతున్న ఆమె కొడుకులతో, బిల్లు మొత్తం చెల్లించిన తర్వాతే శవాన్ని తీసుకువెళ్ళాలనీ, శవాలపైకూడా వ్యాపారం చేసి ఆ క్రూరహృదయులు చెప్పారు. కేవలం చంపించడానికే ఆమెని వాళ్ళు హాస్పటల్‌కు తీసుకువచ్చినట్టుంది. కానీ, ఆ పెద్దబిల్లు, ఆమెని చంపడానికి తీసుకున్న చర్యల ఖరీదని తెలిసినప్పుడు బాధకలుగుతుంది." అని మొదటి వాడి కథాకథనం.

"ఈమధ్య ఈ ఆసుపత్రిలో పనిచేసే ఒకరి బంధువుననే చిరునామాతో ఒకడు ఇక్కడికి చెకప్‌కు వచ్చాడు. అంత డబ్బున్నవాడేమీకాదు, కానీ, మంచి ఆరోగ్యంతో యాభై ఏళ్ళ వయస్సున్న ఒక బిజినెస్‌మేన్. అతనికి జబ్బేమీలేదు. ఏదో కొద్దిగా అజీర్ణం కానీ గ్యాస్‌ట్రబుల్‌కానీ ఉండివుండవచ్చు. ఇక్కడికి రాగానే ఇ.సి.జి తీసుకున్నారు. ఇ.సి.జి. కాగితం చూసిన డాక్టరు ఏదో అనుమానంతో ఆయన్ని ట్రెడ్‌మిల్‌పై ఎక్కించారట. అతను హాయిగా దానిమీద ఒక పదిపదిహేను నిముషాలు గబగబా నడిచాడు. కొంచెం రొప్పుతున్న అతన్ని క్యాంటీన్‌కు వెళ్ళి ఒక కప్పు వేడికాఫీ తాగమని చెప్పారు. ఆ వేడికాఫీతో అతను ఈ ప్రపంచానికే వీడ్కోలు పలికాడు. ఇక్కడికి చెకప్‌కు రాకపోతే అతను ఇంకొంతకాలం ఆగ్యాస్ ట్రబుల్‌తోనే

బతికుండేవాడేమో"! అని రెండోవాడు చెప్పి ముగించినపుడు, మొదటి కథకు ముక్కుపైన వేలేసుకోకుండా ఉండలేకపోయాడు.

ఇదంతా వింటూ నిలబడిన శేఖరులకు గుండెదడ చాలా పెరిగింది. అయితే, ఆ కథకులు, అతి శయోక్తి కొంచెం ఎక్కువ మోతాదులో కలిపి ఉంటారని ఆలోచించి, మహిళలకి లభించబోతున్న రిజర్వేషన్లలాగా 33,22 శాతం సంభ్రమం వాళ్ళకి ముందు కలిగిన వందశాతం కంటే తగ్గించడంలో సఫలీ కృతులయ్యారు.

ఐ.సి.యు నుంచి శివశంకరుణ్ణి అయిదోరోజు గదిలోకి మార్చడంతో అతని భార్య పిల్లలకూ ఎంతో సుఖమూ, సౌకర్యమూ కలిగాయి. ఆ తరువాత కూడా కొన్ని టెస్టులు జరిగాయి. ఇంజక్షన్‌లూ, మందులూ ఇవ్వబడ్డాయి. ఏంజియోగ్రామ్ కూడా తీసుకున్నారు. తరువాత హృద్రోగ నిపుణుల్లో ముఖ్యుడు, శివశంకర్ తనయులను పిలిచి, రుగ్మత గురించి విపులంగా చెప్పాడు. అకౌంట్స్ సెక్షన్‌కి వెళ్ళి కనుక్కోమని డాక్టర్ జవాబిచ్చాడు. చంద్రశేఖరుడు వెళ్ళి కనుక్కున్నాడు. కంప్యూటర్ నుంచి అన్ని వివరాలతో ఉన్న బిల్లు చేతికొచ్చింది. మొత్తం ఎనభై ఆరువేలు అయింది. ముందు కట్టిన పదివేలు తీసేస్తే ఇంకా ఇవ్వవలసింది డెభ్భై ఆరువేలు. చంద్రుడికి గుడ్లు బయటికి పొడుచుకొచ్చాయి. బిల్లు చేతిలోకి తీసుకుని తండ్రిగదికి వెళ్ళి అన్నయ్యని ఒక మూలకు తీసుకెళ్ళి రహస్యంగా చూపించాడు. బిల్లులో రాసిన మొత్తం చూడగానే, సోమశేఖరుడి కుడిచెయ్యి నుదుటిమీదకు వలస వెళ్ళింది. ఇదంతా గమనిస్తున్న శివశంకరుడు,

"ఒరే అబ్బాయిలూ! అదేమిటి! ఇలా తీసుకురండి". అన్నాడు.

"ఏమీ లేదు నాన్నా! మందుల చీటీ!" అని చంద్రశేఖరుడు తెలివిగా ఒక అబద్ధాన్ని వదిలాడు. కానీ, ముసలివాడు అంతటితో వదులుతాడా.

"మందులచీటీ అయితే, నాకు సంబంధించినదే కాదా! నేనొకసారి చూస్తాను. ఒకవేళ అది బిల్లే అయితే మీ తలనొప్పికే పనికొస్తుంది. సోముడికి ఇప్పటికే తలనొప్పి వచ్చినట్టయింది. ఏదయినా ఫర్వాలేదు.రేపు ఉదయం డిశ్చార్జికి ముందు ఇవ్వవలసిందే కాదా! ఇలాతే! నన్నొకసారి చూడనియ్యి!"

గత్యంతరం లేక ఆ బిల్లుని శివశంకరుడి చేతికిస్తూ,

"అందులో, చాలామటుకు మా దగ్గరుంది. కొద్దిగా తక్కువపడినది ఈ రాత్రికే రేడీ చేసుకుంటాం." అని చంద్రశేఖరుడు తొణక్కుండా, బెణక్కుండా చెప్పాడు.

శివశంకరుడు బిల్లు తీసుకుని ఒక సారి అలా పలికించాడు. ఆ బిల్లు మొత్తానికి వచ్చేసరికి, కళ్ళజోడు సర్దుకున్నాడు. మరోక్షణంలో, అతని కనుగుడ్లుపైకి పోయాయి. ఎడమచెయ్యి కళ్ళజోడు, ఎడమపక్కకి, కుడిచెయ్యి బిల్లూ, కుడివైపుకి జారిపోయాయి. తీవ్రమైన గుండెనొప్పి వచ్చినట్లు అతని ముఖమూ, చేతులూ చెపుతున్నాయి. సోమశేఖరుడు పరుగున వెళ్ళి డాక్టరుని, నర్సుని పిలుచుకొచ్చాడు. వెంటనే, డాక్టరు అతనికి ఇంజక్షన్ ఇచ్చాడు. ఆక్సిజన్ సిలిండర్ తగిలించారు. నిముషాల్లో ఇంకో ఇద్దరు డాక్టర్లని కూడా అక్కడికి రప్పించారు. రోగి భార్యాపిల్లలను బయటకు పంపించారు. పదినిముషాల తర్వాత వారంతా బయటకు వచ్చారు. వాళ్ళల్లో ఒక డాక్టర్.

"మీరిక లోపలికి వెళ్ళవచ్చు, వియ్ ఆర్‌టెరిబ్లీ సారీ! బతికించడానికి మా శాయశక్తులా ప్రయత్నించాము, కానీ,....."

కెవ్వున అరుస్తూ దాక్షాయణి లోపలికి పరుగెత్తింది. చలన రహితమైన భర్తశరీరంపైన పడి, ఆమె వెక్కి ఏడ్చింది.

చిన్న పిల్లాడిలా ఏడుస్తున్న తమ్ముణ్ణిగట్టిగా పట్టుకొని సోమశేఖరుడు మూగగా కన్నీరు కార్చాడు. ఈ వార్తవిన్న కొంతమంది అక్కడికి వచ్చి వారిని, ఓదార్చడానికి ప్రయత్నించారు. వాళ్ళలో ఒకరు, సోమశేఖరుడికి, "ఊళ్ళ నుంచి బంధువలెవరయినా రావాల్సి ఉంటే, బాడీని మార్చురీలో పెట్టడమే మంచిది." అని సలహాఇచ్చాడు.

"లేదండీ! మా దగ్గర బంధువులెవరూ అంత దూరంగా లేరు. అమ్మవైపు చుట్టాలకి తెలియపర్చాలి. వాళ్ళు రేపు తెల్లారేసరికాల్ల వచ్చేస్తారు "సోముడు, గునపాన్ని మింగిన రాయిలా చెప్పడు.

వెంటనే కావలసిన, పనులు చూడటానికి సోమశేఖరుడు బయటికెళ్ళాడు. ఆ పనుల్లో అతిముఖ్యమైనది బిల్లుకు సరిపడా డబ్బు సమకూర్చుకోవడం. అది సాధించుకుని, తిరిగి ఆసుపత్రికి వచ్చేసరికి, శవాన్ని మార్చురీకి తరలించడం పూర్తయ్యింది. తల్లీతమ్ముళ్ళ ఏడుపు సీను వాళ్లింటికి షిఫ్ట్‌అయిపోయింది.

పొద్దుట ఎనిమిదిన్నరకు సోమశేఖరుడు ఆసుపత్రికి వెళ్ళి, ప్రధాన హృద్రోగ నిపుణుడ్ని కలిశాడు.

"ఐయామ్ వెరీసారీ! కానీ, ఆ సమయంలో, రోగికి బిల్లు చూపించకుండా ఉండాల్సింది. అతనికి అదొక షాక్‌గా పరిణమించి ఉంటుంది. హార్ట్‌పేషెంట్స్‌కి హఠాత్తుగా వచ్చేసంతోషంకానీ, దుఃఖంకానీ, అశ్చర్యంకానీ,.... ఆవిధంగా ఆకస్మికంగా కలిగేవేమీ కూడా తట్టుకొనే శక్తి ఉండదు. ఏదేమయినా చాలా ఘోరం జరిగిపోయింది. ఆపరేషన్ జరిగి ఉంటేవారు మరో పది, పదిహేను సంవత్సరాలు బతికుండేవారు. దురదృష్టం! దేవుడినుంచి పిలుపు వచ్చినప్పుడు వెళ్ళకుండా ఎవరు మాత్రం ఉండగలరు? తరువాత ఒక విషయం. నాఫీజు నుంచి ఐదువేలు తక్కువ చేయమని కావాలంటే అకౌంట్స్ వాళ్ళకి చెప్తాను." అని ఆ డాక్టర్ దయాసాగరుడు చెప్పాడు.

అంతవరకూ డాక్టర్ చెప్పినదంతా, సోమశేఖరుడుడికి నచ్చింది. "వద్దు, డాక్టర్! వద్దు. మా దుఃఖాన్ని మీతో పంచుకోవాలని మాకులేదు.. అదీ ఆర్థికపరంగా.."

"మూడు నెలల్లోల బైపాస్ ఆపరేషన్ చేయాల్సిందే కదా! ఒకవేళ దాని తరువాత ఇలా జరిగి ఉంటే... అంత నష్టం కలగకుండా దేవుడు మిమ్మల్ని కాపాడారు. దానికి, మీరు ఆయనకు కృతజ్ఞతలు చెల్లించాలి. "అని డాక్టరు చెబుతుంటే, సోమశేఖరుడికి అతని చెంపలు వాయించాలని అనిపించింది. సంయమనం పాటిస్తూ.

"ఒకవేళ అలా జరిగినా మేము దేవుడిని నిందించము. మాకున్నది ఒకే ఒక తండ్రి. వారి ఆరోగ్యం కోసం ఖర్చు చేసినప్పుడు, లాభ నష్టాలు ఆలోచించము. మీరు నాన్నగారికి చేసిన సేవలకు మా ధన్యవాదాలు. నమస్కారం. "అంటూ గబగబా ఆగదిలోంచి బయటకు నడిచాడు.

బిల్లు కట్టడానికి ఎకౌంట్స్ సెక్షన్‌లోకి వెళ్లేటప్పుడు, బిల్లు, మొత్తంలో మళ్ళీ మార్పు వచ్చినట్లు కనబడింది. చావబోతున్న రోగిని బతికించడానికి, వాళ్ళు చేసిన ప్రయత్నాలకు, చనిపోయిన వ్యక్తిని విశ్రాంతి స్థానం (మార్చురీ)లో పెట్టినందుకు ఇవ్వాల్సిన ఛార్జీలు కలిపి మొత్తం కట్టాల్సినది ఎనభైఒక్కవేలరూపాయలు.